

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు నంద్యాల
బుధవారం| 03 డిసెంబరు 2025
పేజీలు 8

## లక్ష్యానికి ఆమడ దూరంలో
# పీ-4 పథకం

- కొనసాగుతున్న దాతల జాడ
- ప్రస్తుత దత్తత కుటుంబాల పురోగాభివృద్ధి పై శూన్య సమాచారం
- దాతలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి


పీ-4 పథకం లోగో

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీ4(పీపుల్, ప్రైవేట్, పబ్లిక్, పార్టనర్‌షిప్) పేదరిక నిర్మూలన పథకం క్షేత్రస్థాయిలో పలు సవాళ్లను ఎదుర్కొంటుంది. 2029 నాటికి సుమారు 40లక్షల కుటుంబాలను పేదరికం నుండి బయటకు తీసుకువచ్చి 'జీరో పావర్టీ' సాధించాలనే బృహత్తర లక్ష్యం మంచిదే అయినప్పటికీ అమలులో లోపాలు, సమన్వయ లోపం కారణంగా ఆశించిన ఫలితాలు దక్కే పరిస్థితి కనిపించడం లేదు. దాతల గుర్తింపులో జాప్యం, నిధుల కొరత ఆందోళన పర్యవేక్షణ దాతల నుండి ఎంతవరకు సహాయ, సహకారాలు అందాయి అనే సమాచారాలు కేవలం ఆన్‌లైన్‌లోనే ఉన్నాయి తప్ప అధికారుల లెక్కల్లో లేవు.ఈ పథకం విజయవంతం కావాలంటే పేద కుటుంబాలను దత్తత తీసుకోవడానికి లక్షలాది మంది ఆర్థికంగా స్థితిమంతులైన మిగతా 2లో

## నంద్యాల కలెక్టరేట్ వార్త

- వరి పంటలు వేసుకోవద్దు జిల్లా మంత్రులు ఎన్.ఎం.డి. ఫరూక్,బీసీ.జనార్ధన్‌రెడ్డి
- నంద్యాల కలెక్టరేట్‌లో నీటి పారుదల సలహా మండలి సమావేశం
- సమావేశంలో పాల్గొన్న మంత్రులు, కలెక్టర్,ఎమ్మెల్యేలు, అధికారులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రబీ సీజన్‌లో వరి పంటలకు బదులుగా ఆరుతడి పంటలను వేసుకోవాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవినాలు, మౌళిక సదుపాయాలు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన నీటిపారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ఈసమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, కేసీ కెనాల్ చైర్‌పర్సన్ మిగతా 2లో

## రబీ సీజన్‌లో ఆరుతడి పంటలకే
# ప్రాధాన్యం ఇవ్వండి


నీటిపారుదల సలహా మండలి సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

## ప్రాజెక్టుల శంకుస్థాపనకు
# కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఆహ్వానం

- ఆహ్వానించిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ.భరత్


కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సత్కరించిన మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** సిఎం చంద్రబాబునాయుడు దార్శనిక నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ భారతదేశం యొక్క అధునాతన రక్షణ తయారీ కేంద్రంగ వేగంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం మంత్రి టీజీ భరత్ ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ని కలిశారు. ఏపిలో నాలుగు ప్రధాన రక్షణ తయారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడానికిఅధికారికంగా ఆహ్వానించారు. శ్రీ సత్యసాయి జిల్లా, కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ మిగతా 2లో

## ప్రయాణికుల బస్సు
# భద్రతా చట్టాన్ని తీసుకురండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన రాష్ట్ర మంత్రి టీజీ.భరత్


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి టీజీ భరత్, ఎంపి నాగరాజు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** దేశానికి సంబంధించిన కీలకమైన రవాణా, భద్రతా విషయాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఢిల్లీలో ఎంపి బస్తిపాటి నాగ రాజుతో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మంత్రి టీజీ భరత్ కలిశారు. ఇటీవల బస్సు ప్రమాదాలు ఎక్కువగా జరిగి ఎంతోమంది మిగతా 2లో

# డాక్టర్ గ్రేస్ ఈజ్ గ్రేట్..

- వైకల్యంను జయించి విజేతగా నిలిచింది
- ఆదర్శం ఆమె సంకల్పం


**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** పుట్టిన ఆరు నెలలకే పోలియో మహమ్మారి రూపంలో వచ్చిన అంగవైకల్యం ఆమెకు శాపంగా మారింది. అయినా ఆమె కుంగిపోలేదు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా జీవితంతో పోరాటం కొనసాగించింది. అసలే అంగ వైకల్యం, ఆపై సమాజంలోని హేళనలు, వివక్షలు, ఇవేమీ ఆమెను నిలువరించలేక పోయాయి. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని రుజువు చేసింది. తనకు నచ్చినట్టుగా తన తలరాతను తానే రాసుకుంది. చివరికి ఆమె సంకల్పం ముందు అంగవైకల్యం ఓడిపోయింది. అవరోధాలు, అవహేళనలు అధికమించి ఒక విజేతగా నిలబడిన డోన్ ఆయుష్ వైద్యాదికారిణి డాక్టర్ గ్రేస్ సెలెస్టియన్ జీవితం నేటి సమాజంలోని ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. కర్నూలు నగరానికి చెందిన జయరాజు, యేసుదయమ్మ దంపతుల కుమార్తె డాక్టర్ గ్రేస్ సెలెస్టియన్ నేటి సమాజంలోని ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుంది. మిగతా 2లో


డాక్టర్ గ్రేస్ సెలెస్టియన్, డోన్ ఆయుష్ మెడికల్ అధికారిణీ

# అక్రమంగా చెరువులో మట్టి తరలింపు

- అడ్డుకున్న గ్రామస్తులు

2లో


అక్రమ మట్టి తరలింపును అడ్డుకుంటున్న గ్రామస్తులు

# రబీ సీజన్‌లో ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

రామలింగారెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్టు చైర్మన్ సంజీవకుమార్‌రెడ్డి, ఎస్ఆర్‌బీసీ చైర్‌పర్సన్ రాజశేఖర్‌రెడ్డి, సాగునీటి సంఘాల నాయకులు, ఇరిగేషన్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రబీ పంటలకు సాగునీరు అందించే అంశంపై చర్చించారు. వరి పంటలకు బదులుగా ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించారు. కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ ఆయకట్టులో ఎంతమేరకు నీరు విడుదల చేయాలి అనే అంశంపై ఇరిగేషన్ అధికారులతో సమగ్రంగా సమీక్షించారు, ఎస్ఆర్‌బీసీ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేసీ కెనాల్ పరిధిలో తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు కొత్తగా నిర్మించడంతో తాత్కాలిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అందువల్ల 0-120, 120-150 కి.మీ వరకు ఈ సీజన్‌లో నీటి విడుదల సాధ్యం కాదని ఎమ్మెల్యేలకు సూచించారు. రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ఉద్దేశమని ఏవైనా సమస్యలు తలెత్తితే రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. తెలుగుగంగ ఆయకట్టు పరిధిలో మార్చి చివరి వరకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఏ ప్రాజెక్ట్ మరమ్మతుల సమయంలోనైనా కొంతకాలం ఇబ్బందులు తప్పవని రైతు సంఘాల నాయకులు అర్థం చేసుకోవాలన్నారు. రైతు ప్రయోజనం కోసం అందుబాటులో ఉన్న అవకాశాన్ని వినియోగిస్తామన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్ర బాగుంటుందన్న సిద్ధాంతంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు కట్టుబడి ఉందని గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో మార్చి 31వరకు సాగునరు అందించే వీలుందని ఇప్పటికే శ్రీశైలం మండలంలోని వెలుగోడు, బండి ఆత్మకూరు మండలాల్లో వరిసాగు ప్రారంభమైనప్పటికి దిగువన ఉన్న ఆళ్ళగడ్డ నియోజకవర్గానికి వరిసాగునీరు ఇవ్వడం సమస్యగా ఉన్న కారణంగా ఆరుతడి పంటలకు మాత్రమే నీరు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిలు మాట్లాడుతూ తెలుగుగంగ, కేసీ కాలువల ద్వారా స్థిరీకరించిన ఆయకట్టుకు డిస్ట్రిబ్యూటరీ సిస్టం సరిగా లేకపోవడం వల్లే నీరు ఇవ్వలేకపోతున్నామని, ఈ వర్షాకాలంలో మంచి వర్షపాతం నమోదు కావడంతో రబీ కాలానికి నీరు అందుబాటులో ఉండడం రైతుల్లో ఆనందం కలిగించిందన్నారు. సిద్ధాపురం చెరువు ద్వారా 23వేల ఎకరాలకు నీరు అందించేలా చర్యలు ప్రారంభించినప్పటికీ కేవలం 10వేల ఎకరాలకే నీరు చేరుతుందన్నారు. కొండజూటూరు గ్రామాల్లో పంటలు మునిగిన రైతులను ఆదుకోవడం కోసం రూ.88లక్షల ప్రతిపాదనలు ప్రభుత్వంకు పంపించామని, తొగర్చేడు గ్రామ రైతు నష్టపరిహారం కోసం రూ.84లక్షలు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కేసీ కాలువ కింద ఉన్న రైతులకు నీరు ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు.

# లక్ష్యానికి ఆమడ దూరంలో పీ-4 పథకం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తులు(దాతలు) మరియు ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని, దీనికి సంబంధించి కర్నూలు జిల్లాలో లక్ష్యం సగం కూడా పూర్తి కాలేదు. కర్నూలు జిల్లాలో అమలు తీరును పరిశీలిస్తే, ఉగాది నుండి ఆగస్టు నెల వరకు 91వేల బంగారు కుటుంబాలను గుర్తించారు. ఈ 91వేల కుటుంబాలలో కేవలం 35వేల కుటుంబాల వరకు మాత్రమే 5వేల మంది దాతలు ముందుకొచ్చి సహాయంగా నిలిచారని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సిపిఓ) భారతి తెలియజేశారు. అంటే ఇంకా 56వేల బంగారు కుటుంబాలకు దాతల కోసం చూడాల్సి వస్తోంది. అయితే పి4 ప్లాట్‌ఫాంలో నమోదు చేసుకున్న దాతల సంఖ్య లక్ష్యానికి అనుగుణంగా లేదని తెలుస్తోంది. గుర్తించిన బంగారు కుటుంబాల సంఖ్య ఎక్కువగా ఉండగా వారికి సరిపడా దాతలు లభించకపోవడంతో పథకం ప్రారంభంలోనే ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. దీని ఫలితంగా దత్తత ప్రక్రియ పూర్తి కావడంలో జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా, దాతలు అందించే సహాయం స్వచ్ఛంధంగా, నిరంతరాయంగా కొనసాగుతుందనే విశ్వసనీయతపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ దాతలు మధ్యలో తప్పుకుంటే ఆ కుటుంబాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. ఈ పథకంలో ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా వ్యవహరించడం తప్ప, దాతలను బలవంతం పెట్టడం ఉండదు. దాతలే లబ్దిదారులకు ఆర్థికంగా, ఆరోగ్యకరంగా ఉపాధి, ఉద్యోగం వంటి విషయాల్లో చూసుకుంటారు. మిగిలిన 56వేల బంగారు కుటుంబాలకు కూడా దాతలు వస్తేనే జిల్లా లక్ష్యం పూర్తవుతుందని ఆమె తెలిపారు. ఈ గణాంకాలు రాష్ట్రవ్యాప్తంగా దాతలు ముందుకు రావాల్సిన అవసరాన్ని, దానిలో ఉన్న జాప్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

**సాంకేతిక సమస్యలు, పర్యవేక్షణ లోపాలు :-** పి4 కార్యక్రమం కోసం రూపొందించిన పి4 పోర్టల్ అనే ప్లాట్‌ఫాంలో కుటుంబాల వివరాలను పొందుపరచడం, దాతలతో అనుసంధానం చేయడంలో సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. పేదరికంలో ఉన్న కుటుంబాలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సర్వే చేసి గుర్తించినా ఆ జాబితాల తుది ధృవీకరణలో మరింత పారదర్శకత అవసరమని విమర్శలు వస్తున్నాయి. నిజమైన అవసరమున్న కుటుంబాలకే ప్రయోజనం చేకూరేలా పర్యవేక్షణ యంత్రాంగం బలంగా లేదు. ప్రభుత్వం కేవలం సమన్వయకర్త పాత్రకే పరిమితం కావడంతో ప్రైవేట్ సహాయాన్ని నిరంతరం పర్యవేక్షించి లబ్దిదారులకు సకాలంలో అందేలా చూడడంలో లోపాలు కనిపిస్తున్నాయి. దత్తత తీసుకున్న తరువాత, దాతలు కేవలం ఆర్థిక సహాయానికే పరిమితం కాకుండా, వృత్తి పరమైన మార్గదర్శకత్వం అందించడం ఈ పథకంలో కీలకమైన అంశం. అయితే ఈ మార్గదర్శకత్వం నాణ్యత, దాని కొనసాగింపుపై ఎలాంటి నిక్కచ్చి నియమాలు, పర్యవేక్షణ విధానాల అమలులో లేకపోవడం కూడా ఒక ప్రధాన లోపంగా ఉంది. పేదిరిక నిర్మూలనకు శాశ్వత పరిష్కారం నైపుణ్యాభివృద్ధి ద్వారానే సాధ్యమవుతుంది. కేవలం కొంతకాలం ఆర్థిక సహాయం అందించి ఆ తర్వాత దాన్ని నిలిపివేస్తే ఆ కుటుంబాలు మళ్లీ మొదటికే వచ్చే ప్రమాదం ఉంది. ఈ పథకం విజయవంతం కావాలంటే, గుర్తించిన కుటుంబాలకు కచ్చితమైన, నిరంతర మద్దతు అందేలా ప్రభుత్వం పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది లేనిపక్షంలో ఈ బృహత్తర కార్యక్రమం కేవలం కాగితాలకే పరిమితమయ్యే అవకాశం ఉంటుందని పలు ప్రజా సంఘాలు తమ అభిప్రాయాలు తెలియజేశాయి.

## ప్రాజెక్టుల శంకుస్థాపనకు

# కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)



కేంద్రమంత్రిని ఆహ్వానిస్తున్న మంత్రి టీజీ భరత్

ద్వారా డిఫెన్స్ ఎనర్జిటిక్స్, మందుగుండు సామాగ్రి ఫిల్లింగ్ కాంప్లెక్స్, మడకశిర, హెచ్ఎఫ్‌సిఎల్ ద్వారా అర్టిలరీ షెల్, మల్టీమోడ్ హ్యాండ్ గ్రనేడ్ సౌకర్యం, దొనకొండ, భారత డైనమిక్స్ లిమిటెడ్ ద్వారా ప్రొఫెల్లెంట్, వెపన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సౌకర్యం, అనకాపల్లి లోని బిడిఎల్ ద్వారా అండర్ వాటర్ వెపన్స్, టార్పెడో తయారీ యూనిట్‌ల శంకుస్థాపనకు ఆహ్వానించారు. ప్రాజెక్టులకు రాష్ట్రం నుండి పూర్తి మద్దతు, వేగవంతమైన ఆమోదాలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించినట్లు మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రితో చాలా సానుకూలంగా చర్చ సాగినట్లు తెలిపారు.

# ప్రయాణికుల బస్సు భద్రతా చట్టాన్ని తీసుకురండి

(మొదటి పేజీ తరువాయి)



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి టీజీ భరత్, ఎంపి నాగరాజు

ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తుచేశారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో బస్సు ప్రమాదంలో మంటల్లో చిక్కుకుని ప్రయాణికులు చనిపోయారని, అధునాతన అగ్నిమాపక వ్యవస్థలపై ఆయన ఇదివరకు ఇచ్చిన వినతి మేరకు కొత్త ప్రయాణికుల బస్సు భద్రతా చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. గుత్తి పెట్రోల్ బంక్ సర్కిల్ నుండి పెద్దటేకూరు వరకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న హైవే లైటింగ్ గురించి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదన పరిశీలనలో ఉందని ఆయన తెలిపారన్నారు. ఇక కర్నూలు-బళ్లారి జాతీయ రహదారి ప్రతిపాదనతో సహా ముఖ్యమైన ప్రాంతీయ రహదారి అనుసంధాన అవసరాలను వివరించినట్లు చెప్పారు. ఇది ట్రాఫిక్‌కు సులభతరం చేయడానికి, వాణిజ్యాన్ని పెంచడానికి, మన ప్రజలకు అంతరాష్ట్ర అనుసంధానాన్ని మెరుగు పరచడానికి కీలకమైందన్నారు. సిఎం చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో హైవే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి భద్రతను పెంచడానికి ప్రతి పౌరుడికి సున్నితమైన అనుసంధానాన్ని నిర్ధారించడానికి కృషి చేస్తున్నామని టీజీ భరత్ అన్నారు. కేంద్ర మంత్రితో జరిగిన చర్చ ఎంతో సానుకూలంగా సాగిందన్నారు.

# ఆర్.జంబులదిన్నెలో పొలం బడి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఆర్.జంబులదిన్నె, సర్వాయిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శనగ పంటను పరిశీలించి పొలంలో చౌడు నివారణ కోసం జిప్సం వాడవలసిందిగా రైతులకు తెలిపారు. క్రిమి సంహారక మందులు తగిన మోతాదులోనే వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల ఏడిఏ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# డాక్టర్ గ్రేస్ ఈజ్ గ్రేట్..

(మొదటి పేజీ తరువాయి)

గ్రేస్ పుట్టిన ఆరునెలలకే పోలియో మహమ్మారి రూపంలో వచ్చిన అంగవైకల్యం ఆమెకు శాపంగా మారింది. అయినా ఆమె తల్లిదండ్రులు కుండిపోలేదు. తమ గారాల పట్టికి ఆత్మస్థైర్యంతో ఎలా నిలబడాలో నేర్పించారు. ఏడేళ్ల వయస్సులోనే తెలంగాణాలోని ఖమ్మం పట్టణంలో ఓ ఆస్ట్రేలియన్ మిషనరీ నేతృత్వంలో నడపబడుతున్న సెయింట్ మెరిస్ పోలియో హోమ్ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న క్లారా హింటన్ అనే మహిళ నేర్పించిన మెళకువలు, మనోధైర్యం గ్రేస్‌లో ఆత్మస్థైర్యం పెంపొందించాయి.

5వ తరగతి వరకు అక్కడ చదువుకున్న గ్రేస్ తరువాత కర్నూల్‌లోని సెయింట్ జోసేఫ్ పాఠశాలలో 10వ తరగతి వరకు, ఇంటర్‌మీడియట్ కోల్స్ కళాశాలలో విద్యను అభ్యసించింది. జీవితంలో ఏదోఒకటి సాధించాలన్న తపనతో ఆమె వైద్య రంగం వైపు అడుగులు వేసింది. ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన గ్రేస్‌కు అంగవైకల్యం కారణంగా సీటు ఇచ్చేందుకు అధికారులు అవాంతరాలు కల్పించినా ఆమె వెనుకడుగు వేయలేదు. కళాశాల యాజమాన్యం సహకారంతో హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో ఉన్న బిఆర్‌కెఆర్ మెడికల్ కళాశాలలో చేరిన



యోగా డే నాడు జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ గ్రేస్

గ్రేస్ ఐదున్నర సంవత్సరాల పాటు వైద్య విద్యను అభ్యసించింది. రెండవ సంవత్సరం నుంచి ప్రాక్టికల్స్ కోసం ఎర్రగడ్డ నుండి చార్మినార్‌లో ఉన్న హాస్పిటల్ వరకు దాదాపు 15 కిలోమీటర్లు తన త్రిచక్ర వాహనంపై ప్రయాణించి వైద్య విద్యను పూర్తి చేసింది గ్రేస్.


2002 సంవత్సరంలో సాంఘీక సంక్షేమశాఖలో డాక్టర్‌గా రెండు సంవత్సరాలపాటు కరీంనగర్, సి.బెళగల్‌లలో విధులు నిర్వహించింది. ఆపై 2004లో ఆయుష్ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిన మారుమూల ప్రాంతమైన విజయనగరం జిల్లా అన్నంరాజుపేటలో విధులు నిర్వహించింది. 2006లో రెగ్యులర్ మెడికల్ అధికారిణిగా ఉద్యోగం సాధించిన గ్రేస్ డోన్, పాణ్యంలలో విధులు నిర్వహించి ప్రస్తుతం డోన్ ఆయుష్ ఆసుపత్రిలో మెడికల్ అధికారిణీగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా విపత్కరమైన కోవిడ్ సమయంలో ఆమె కర్నూలు జిల్లా ఆయుష్ అధికారిణీగా ఆమె తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. అందుకుగాను రాష్ట్ర ఆయుష్ కమీషనర్ చేతుల మీదుగా ఉత్తమ వైద్యాధికారిణీగా అవార్డు కూడా అందుకోవడం జరిగింది. ప్రజాసేవయే పరమావధిగా విధులు నిర్వహిస్తున్న గ్రేస్‌కు ప్రజల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం గ్రేస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలిగాను, కర్నూలు జిల్లా గౌరవ అధ్యక్షురాలిగాను కొనసాగుతున్నారు. ముందుకు సాగిన గ్రేస్ ఒక తల్లిగా కూడా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. గ్రేస్ కుమార్తె కూడా ప్రస్తుతం వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు, యువత, మహిళలకు నిర్వహించే సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరై తన ప్రసంగాల ద్వారా వారికి స్ఫూర్తిని నింపుతోంది గ్రేస్.

**ఆత్మహత్యలకు పాల్పడటం సరైనదికాదు..డాక్టర్ గ్రేస్ సెలెస్టియన్, డోన్ ఆయుష్ మెడికల్ అధికారిణి :** చిన్న చిన్న కారణాలతోనే కొంతమంది యువత, మహిళలు ఆత్మహత్యలకు పాల్పడటం సరైందికాదు. దేవుడు అన్ని అవయవాలతో మనిషికి జీవితాన్ని అందించడమే ఒక వరం. అలాంటి అందమైన జీవితాన్ని క్షణికావేశాలతో నాశనం చేసుకోకుండా సమస్యలతో ఎదురీదడం అలవర్చుకోవాలి.



మహిళకు ఆరోగ్య పరీక్ష చేస్తున్న డాక్టర్ గ్రేస్

# నిరుద్యోగ యువతకు రాత పరీక్షలు


రాత పరీక్షలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** చాగలమర్రి మండలంలో, చాగలమర్రిలోని సచివాలయాల పరిధిలో నిరుద్యోగ యువతకు ఆన్లైన్ పరీక్ష మంగళవారం నిర్వహించారు. 17 సచివాలయాల్లో 34 మంది యువతీ యువకులు, కౌసల్యం (వర్క్ ఫ్రం హెూం) దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం అభ్యర్థుల సామర్థ్యం పై కంప్యూటర్లో పరీక్ష నిర్వహించడమేందని ఎంపీడీవో తాహెర్ హుస్సేన్ తెలిపారు. 34 మంది గాను 13 మంది పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ పరీక్ష పర్యవేక్షణను జి ఎస్ డబ్ల్యూ ఎస్ డిప్యూటీ ఎంపీడీవో తారకేశ్వరి పరిశీలించడం జరిగింది.

# పన్నులే ప్రగతికి పునాది – కమీషనర్ విశ్వనాథ్

**:– మొండి బకాయిదారులపై ఉదాసీనత తగదు**

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** నగరాభివృద్ధికి పన్నులే ప్రధాన ఆధారమని వాటిని రాబట్టడంలో ఉదాసీనత వైఖరి తగదని నగరపాలక సంస్థ కమీషనర్ పి విశ్వనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో రెవెన్యూ విభాగ సిబ్బందితో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నగరపాలకకు రూ.93కోట్ల ఆస్తి పన్నులు, రూ.14.78కోట్ల తాగునీటి కొళాయి చార్జీల బకాయిలు రావాల్సి ఉన్నాయని, అందులో మొండి బకాయిలే అధికంగా ఉండటం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, ఇప్పటికే జారీ చేసి ఉంటే దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. నగరం ప్రగతి పథంలో నడవాలంటే పన్నులే కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్ఐలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ సేవ అవార్డు అందుకున్న ఐసిటిసి సెంటర్

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మైక్రోబయాలజీ విభాగ పరిధిలోని ఐసిటిసి సెంటర్‌కు రాష్ట్ర ఉత్తమ సేవ అవార్డు వచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి, స్క్రీనింగ్ సేవలు, కౌన్సిలింగ్ నాణ్యత, డేటా మేనేజ్‌మెంట్, పేషెంట్ కేర్‌లో ప్రొఫెషనల్ పనితీరును గుర్తించి ఈ అవార్డు వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మైక్రోబయాలజీ విభాగాధిపతి డా.రేణుకా దేవి మాట్లాడుతూ ఈ విభాగంలో శక్తివంచన లేకుండా కృషి చేసినందుకు తగిన ఫలితం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో డా. నాగజ్యోతి, ఐసిటిసి ఇంచార్జ్ డా. షర్మిల, వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.


అవార్డును మైక్రోబయాలజీ విభాగానికి అందిస్తున్న సూపరింటెండెంట్

# రాష్ట్ర స్థాయి రగ్బి ఆటలో మీదివేముల జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ


స్వాతి,మైత్రిలను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాస యాదవ్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఎన్‌టిఆర్ జిల్లా గన్నవరంలో రాష్ట్ర స్థాయిలో పాఠశాల క్రీడల ఫెడరేషన్ తరపున నిర్వహించిన రగ్బి ఆటలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వాతి, మైత్రి అద్భుత ప్రతిభ కనబరిచి కర్నూలు జిల్లా మొదటి స్థానంలో విజేతలుగా నిలవడంలో ప్రధానపాత్ర పోషించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాను విజేతగా నిలిపి కప్పు సాధించడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించారని వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున, అరుణ కుమారిలను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రెండవ రోజు స్పెషల్ క్యాంప్

**పాణ్యం, మేజర్‌న్యూస్ :** స్థానికశాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల సమీపంలోని ఒడ్డుగండ్ల గ్రామంలో రెండవ రోజు స్పెషల్ క్యాంప్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎంవి సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యర్థ పదార్థాలను నివారించి వాటిని తడి చెత్త, పొడి చెత్తగా విభజించడం, పరిశుభ్రత, తదితర వాటిపై ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు సూచించినట్లు తెలిపారు. వ్యర్థాలను వేరు చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని భూమిలో కలిసే చెత్త పరిమాణం తగ్గడం వల్ల వ్యర్థాల నుంచి వనరులను తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రీసైక్లింగ్ శాతాన్ని మెరుగుపరచడం, ఆరోగ్యమైన వాతావరణంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, ఇన్‌చార్జ్ శ్రీహరి, నీటి సంఘం ప్రెసిడెంట్ మోహన్‌కుమార్, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.




# రహదారి విస్తరణల్లో బాధితులకు పూర్తి న్యాయం

**:– కమీషనర్ పి విశ్వనాథ్**

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** నగరంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనుల్లో భూమి, భవనాలు కోల్పోయే బాధితులందరికి పూర్తిస్థాయి న్యాయం చేస్తామని కమీషనర్ పి విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జ్ వరకు (ఆర్డీపి–2), చెక్‌పోస్ట్ నుండి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణ పురోగతిపై పట్టణ ప్రణాళిక అధికారులతో కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు ట్రాఫిక్ నియంత్రణకు రహదారుల విస్తరణ ఆవవ్యకతను వివరించి, యాజమాన్య ప్రతాలను తీసుకోవాలని ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణలో ప్రభావితమవుతున్న 82మంది ఆస్తుల యజమానులతో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నగర అభివృద్ధికి ప్రజల సహకారం కీలకమని, స్వచ్ఛంధంగా సహకారం అందిస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని కమీషనర్ పేర్కొన్నారు. సమీక్షలో ఇంచార్జ్ సిటీ ప్లానర్ బి వెంకట రమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమీషనర్ విశ్వనాథ్

# 9, 10వ తేదీల్లో కర్నూలు బాలోత్సవం

**:– పిల్లల పండుగను విజయవంతం చేయండి**

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఈ నెల 9, 10న నిర్వహించే కర్నూలు బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి పుల్లయ్య, అధ్యక్షులు జంద్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి ధనుంజయలు కోరారు. నగరంలోని ఏ క్యాంపు మోంటిస్సోరి పాఠశాలలో మంగళవారం బాలోత్సవం లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు బాలోత్సవం లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి పుల్లయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం లేకపోవడం వల్ల పిల్లలు ఫోన్లు, ట్యాబ్‌లకు బానిసలవుతున్నారన్నారు. మార్కులు, ర్యాంకులు, సీట్లు అనే పద్ధతిలో విద్యాసంస్థలు ఉంటున్నాయన్నారు. పిల్లలను కంట్రోల్ చేసుకోవడం టీచర్లకు పెద్ద సమస్య అయిపోయిందని, పిల్లలపై జాగ్రత్త వహించకపోతే వారి మానసిక ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాలోత్సవం లాంటి కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేలా చేయడం మంచి పరిణామమన్నారు.


లోగోను ఆవిష్కరిస్తున్న వక్తలు

బాలోత్సవం ద్వారా కొంతమందైనా సెల్‌ఫోన్ నుంచి దూరంగా ఉండటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. పిల్లల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు మానసిక ఉల్లాసం కోసం ఈ కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. ముందుగా కర్నూలు బాలోత్సవం పూర్వ ప్రధాన కార్యదర్శి జేఎన్ శేషయ్యకు నివాళిగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు విద్యాసంస్థల అధ్యక్షులు వాసుదేవయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల సిఈఓ విల్సన్, ఇండస్ పాఠశాల ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్, బాలోత్సవం ఉపాధ్యక్షులు సుధీర్ రాజు, రమాదేవి, కోశాధికారి జె రంగస్వామి, ప్రచార కార్యదర్శులు ఎల్లాగౌడ్, డి చంద్రమోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రైతులు భూసారం ఆధారంగా ఎరువులు వాడాలి

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రతి రైతు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారిత ఎరువులు వాడాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.వి. జయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకంలో భాగంగా రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీన్‌తో పాటు ప్రొఫెసర్లు పాల్గొని రైతుల సమస్యలకు నివృత్తి కల్పించారు. డీన్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. పంటకోత సమయంలో దిగుబడులు నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచించారు. పంట నాణ్యతను కాపాడుకోవాల్సిన విధానాన్ని సూచించారు. డా.ఎల్.విజయభాస్కర్ మాట్లాడుతూ అరటి, పసుపు, మొక్కజొన్న పంటలలో వచ్చే వివిధ రకాల పురుగులు, వాటి యాజమాన్యం గురించి తెలియజేశారు. అలాగే రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటికి నివృత్తి కల్పించారు. ఈ కార్యక్రమంలో డా.పి.గణేష్, డా.పి.వీరయ్య, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరీ, డా.మాధవి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు విజ్ఞాన పదర్శన నిర్వహించారు.


విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు, రైతులు

# పాడిపరిశ్రమను ప్రోత్సహించండి

**సంజామలమేజర్,న్యూస్:** రైతులకు అవగాహన కల్పించి పాడి పెంపకాన్ని ప్రోత్సహించాలని పశుసంరక్షణ శాఖా ఎ.డి డాక్టర్ కొండారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన సంజామలలో పశు ఏరియా ఆసుపత్రిలో కొలిమిగుండ్ల, సంజామల మండలాల పశువైద్య సిబ్బందితో డాక్టర్ ఎ.డి కొండారెడ్డి సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి పశుసంపదను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్.ఎస్.ఎస్ ఇంజక్షన్ రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. 90శాతం పైదూడ జన్మించే అవకాశం ఉందని ఎ.డి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రిష్ణకుమార్, డాక్టర్ రాం భూపాల్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎ.డి కొండారెడ్డి

# డిప్యూటీ ఎంపిడిఒగా హరికుమార్ బాధ్యతల స్వీకరణ

**అవుకుమేజర్,న్యూస్:**

అవుకు మండల డిప్యూటీ ఎంపిడిఒగా హరికుమార్ నేడు బాధ్యతలను స్వీకరించారు. ఆయన గతంలో అవుకు గ్రామ పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉండినారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రమోషన్‌లో భాగంగా ఆయనను డిప్యూటీ ఎంపిడిఒ నియమించి అవుకు మండలానికి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనకు ఇచ్చిన బాధ్యతలను సహ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో నిర్వర్తించగలనని అన్నారు.



# వైకల్యం ప్రతిభకు అడ్డుకాకూడదు- ఎమ్మెల్యే కె.ఈ

– తల్లిదండ్రులు మానసిక ధైర్యాన్ని పెంపొందించాలి


విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కెఈ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె. ఈ

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** వైకల్యం వారి ప్రతిభకు అడ్డుకాకూడదని ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవసరాల పిల్లలకు వైకల్యపు పరీక్షల ప్రత్యేక క్యాంపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. వేద క్రీడల్లో ప్రతిభ చూపిన ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకల్యం ఉన్న పిల్లలను సమాజంలో ఒకరిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు కూడ వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రోత్సహించాలన్నారు. అంతేకాకుండా విద్యార్థుల వైకల్యాలను పరీక్షలు ద్వారా గుర్తించి వారికి అవసరమైన పరికరాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఆ విద్యార్థులకు సేవలందిస్తున్న భవిత కేంద్రాల నిర్వాహకులు సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.ఎన్ లోకరాజు, జిల్లా సహిత విద్యా కో-ఆర్డినేటర్ సురేంద్ర, బాబుజీ, ఎంఈఓలు రాజా రామ్, మోహన్, రమేష్, సిఐ జయన్న, టీడీపీ నాయకులు బత్తిన లోకనాథ్, ఐఈఆర్డీలు శ్రీనివాసులు, తేజ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయిలో ఖచ్చితమైన ఎస్ఐఆర్

**త్వరితగతిన ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలి– కమీషనర్ విశ్వనాథ్**

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** కర్నూలు నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌ను బూత్ స్థాయిలో ఖచ్చితంగా, ఎలాంటి తప్పుల్లేకుండా పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ సూచించారు. మంగళవారం ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అసిస్టెంట్ ఆర్‌ఓలతో కలిసి బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను బూత్ స్థాయిలో అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని బిఎల్‌ఓలకు సూచించారు. ప్రతి ఓటర్ వివరాలు, చిరునామా, ధృవీకరణ, కుటుంబ సభ్యుల సమాచారం అన్నీ బూత్ యాప్‌లో తప్పనిసరిగా ఖచ్చితంగా నమోదు కావాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం జరిగితే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,74,743మంది ఓటర్లలో 29,946 మంది మాత్రమే బిఎల్‌ఓలు మ్యాపింగ్ చేశారని, 7,716మంది ప్రోజనీ నమోదు చేసినట్లు ఆర్‌ఓ వివరించారు. మొత్తం మ్యాపింగ్ శాతం 13.76శాతం మాత్రమే ఉండడంతో దీన్ని అత్యవసరంగా పెంచి ప్రతి బూత్‌లో 100శాతం మ్యాపింగ్ సాధించాలని సూచించారు. ఎస్ఐఆర్ ఖచ్చితత్వం ఎన్నికల పారదర్శకతకు పునాదిగా పని చేస్తుందని ఆర్‌ఓ పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ రవికుమార్, అదనపు ఏఈఆర్‌ఓలు ఆర్‌జివి కృష్ణ, కెవి సతీష్ కుమార్ రెడ్డి, పివి శేషసాయి, ఉప తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమీషనర్ విశ్వనాథ్

# అక్రమంగా చెరువులో మట్టి తరలింపు

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్లమండలపరిధిలోనిఎం. పెండేకల్లు గ్రామ పంచాయతీలోని మర్రికుంట వెంకటగిరి గ్రామాల మధ్యన గల చెరువులో ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తున్నా రని గ్రామల రైతులు ట్రిప్పర్లను మంగళవారం అడ్డుకున్నారు. గత మూడు రోజుల నుండి చెరువులోని మట్టిని ఇటాచి ద్వారా తవ్వకాలు జరిపి ఉలిందకొండలో గల ఇటికలబట్టిలకు తరలిస్తుండడంతో మా పంచాయతీ పరిధిలో చెరువులో మట్టిని ఎవరి అనుమతి తీసుకొని తరలిస్తున్నారని అడ్డుకున్నారు.మా పొలాలకు మట్టిని తీసుకువెళ్లాలంటే అధికారులు అనుమతులు ఇవ్వకుండా అనేక కారణాలు చెబు తూ అడ్డుకునే అధికారులు హిటాచి పెట్టి బయట వ్యక్తులు తరలిస్తున్న అడ్డుకోకపోవడంఎంతవరకు సమంజసంమనిరైతులు ప్రశ్నించారు. ఈ విషయాన్ని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతులు జిల్లా కలెక్టర్ రాజకుమారి దృష్టికి తీసుకెళ్లగా మీ చెరువులో తవ్వుకోవడానికి ఎవరికి అనుమతి ఇవ్వలేదని తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని అనుమతులు ఇచ్చిన భూగర్భ గనుల శాఖ అధికారులను ఆదేశించారు కానీ యధావిధిగా తవ్వకాలు జరుగుతుండడంతో ఎం పెండేకల్లు మర్రికుంట వెంకటగిరి రేపల్లె రైతులు తవ్వకంను రైతులు అడ్డుకున్నారు. సమస్యను మరల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రైతులు తెలిపారు.ఈ విషయంపై భూగర్భ గనుల శాఖ ఏడి రాజగోపాల్ రెడ్డిని వివరణ కోరగా మైనర్ ఇరిగేషన్ అధికారులుఅనుమతి తీసుకొనిరావడంతో కర్నూలు జిల్లాలోని కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామానికి చెందిన పి. నాగభూషణంకు చెందినచెందిన ఎన్వీఆర్ బ్రిక్స్ కు కొన్ని రోజుల క్రితం 1000 క్యూబిక్ మీటర్లకు, గతవారం క్రితం మరో 1000 క్యూబిక్ మీటర్లకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.మైనర్ ఇరిగేషన్ భూగర్భ గనులశాఖఅధికారులుచెరువులోమట్టితవ్వుకోవడానికి అనుమతులు ఇచ్చిన మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం వద్ద రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో తవ్వకాలకు లెక్కపక్క ఉండదని విషయం తేట తెల్లం అవుతుంది పెద్ద ఎత్తున ట్రిప్పర్ల ద్వారామట్టి తరలిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మర్రికుంటా గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డి ,కుళాయి, చిన్న జంగం రెడ్డి,వీరారెడ్డి,గోపాల్ ,నారాయణ,సుబ్బయ్య తదితరులు మాట్లాడుతూ గతంలో పశువులు ఎక్కువగా ఉండటం వలన పేడ ఎరువు ఉండటం వలన సమస్య ఉండేది కాదు ప్రస్తుతం పశువుల లేకపోవడంతో పంట పొలాలు భూసారం తగ్గిపోతున్నాయి రెండు మూడు సంవత్సరాలకు ఒక్కసారి చెరువు మట్టిని తోలుకోవడం వలన పంటలు దిగుబడి వస్తుంది ఇటుకల బట్టి లకు చెరువు మట్టిని తరలిస్తే మా పొలాలకు మట్టి ఎక్కడ నుంచి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం మళ్ళీ కలెక్టర్ కు వినతిపత్రాన్ని ఇవ్వడానికి గ్రామస్థులు వెళ్లారు.



# బిహెచ్ఎంఎస్‌లో విద్యార్థిని శోభారాణి టాఫర్

**హొళగుంద,మేజర్‌న్యూస్:** హొళగుందకు చెందిన హెచ్ శోబారాణీ విద్యార్థి బిహెచ్ఎంఎస్ హోమియోపతి డాక్టర్ సీట్ కోసం 936/1000 మార్కులతో టాఫర్ గా నిలిచింది.స్థానిక సలోమి,లేట్ వీరేశ్ దంపతుల కుమార్తె శోభారణి గుంతకల్‌లో ఏడవ తరగతి వరకు చదవింది.మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఇంటర్మీడియట్ గాయత్రీ కళాశాలలో చదవి సెకెండ్ ర్యాంక్ సాధించింది.నీట్ పరీక్షను రాయగా గుంతకల్ పద్మావతి కళాశాళలో హోమియోపతి డాక్టర్ సీట్ కోసం రాయగా ఫస్ట్ ర్యాంక్ సాధిం చింది.కష్టపడి చదవి మంచి ర్యాంక్ సాధించినందకు కుటుంబ సభ్యులు హెచ్ ఈరమ్మ,పక్కీరప్ప,సరస్వతి,మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్,మౌనికఅరుణ, సౌబాగ్య.బంధుమిత్రులు, సన్నిహితులు తోటి విద్యార్థులు శోభారాణిని అభినందించారు.



# ఏప్రిల్ 15 వరకు సాగునీరు అందించండి

-ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలోని తెలుగు గంగ, కెసి కెనాల్ ఆయకట్టుకు ఏప్రిల్ 15 వరకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అధికారులను కోరారు. మంగళవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 15 వరకు ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందించాలని కలెక్టర్‌ను కోరారు.గత ప్రభుత్వంలో సాగునీరు అందక రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు చివరి ఆయకట్టు వరకు నీరు అందేలాగా చూసుకుంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ రైతులకు భరోసాను ఇచ్చారు.

# 4న ఘంటసాల జయంతి ఉత్సవం

:– స్వరాభిషేకం గాయాకులు మిత్ర రాక

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** అమర గాయకుడు ఘంటసాల జయంతి పురస్కరించుకుని స్థానిక సి క్యాంపులోని టీజీవి కళాక్షేత్రంలో ఈ నెల 4న గురువారం ఘంటసాల స్వరార్చన పేరుతో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యక్రమ కన్వీనర్ ఎస్ఎండి ఇనాయతుల్లాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంగీత విభావంలో హైదరాబాద్‌కు చెందిన స్వరాభిషేకం ఫేమ్ సుప్రసిద్ధ గాయకుడు మిత్ర పాల్గొననున్నారని తెలిపారు. హైదారాబాద్ గాయని అఖిల గాయకుడు శ్రీనివాసులు తదితరులు అలనాటి చిత్రాలలోని ఘంటసాల గీతాలను ఆలపిస్తారని అన్నారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ న్యూరో సర్జన్ డా.డబ్ల్యూ సీతారాంకి విశిష్ట సేవ పురస్కారం చేయనున్నారని తెలిపారు. సంగీత అభిమానులు విశేష సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# శ్రీ చౌడేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్న బి.సి రాజారెడ్డి


అమ్మవారి సన్నిధిలో బి.సి రాజారెడ్డి


**బనగానపల్లెమేజర్,న్యూస్:** నందవరం శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థానం నందు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి చౌడేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్నారు. వారు ఆలయానికి చేరుకోగానే ఛైర్మెన్ పి.వినాగార్జున రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ పి.వి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు మొదటి అవార్డు


సిబ్బందికి అవార్డును అందచేస్తున్న సూపరింటెండెంట్

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌కు రాష్ట్రంలోనే అత్యధికంగా బ్లడ్ యూనిట్‌లను కలెక్ట్ చేసినందుకు స్టేట్ మొదటి అవార్డు రావడం శుభపరిణామమని సూపరింటెండెంట్ డా.కె వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ డిసెంబరు 1వ తేదీ విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో అవార్డు అందుకోవడం పట్ల బ్లడ్‌బ్యాంక్ సిబ్బందిని అభినందించినట్లు తెలిపారు. ఈ బ్లడ్ బ్యాంక్‌లో ఏడాది కాలంలో 11531 బ్లడ్ యూనిట్స్‌ను కలెక్ట్ చేసి ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్ర స్థాయి మొదటి స్థానం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా. సుదీర్, డా. రసూల్, డా. కిరణ్ కుమార్, డా. రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# యార్లపాటి శ్రీధర్‌శర్మకు సన్మానం


అర్చకుడు శ్రీధర్‌శర్మ, మాలదారులు, ఆలయ కమిటీ సభ్యులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** వెల్దుర్తిలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, ఆలయ కమిటీ కోశాధికారి యార్లపాటి శ్రీధర్‌శర్మకు ఘనంగా సన్మానం జరిగింది. మంగళవారం ఇరుముడి కార్యక్రమంలో దాదాపు 50 మంది అయ్యప్ప మాలదారులు శబరి మలకు బయలుదేరారు. ఈ సందర్భంగా మాలదారులు బంధు మిత్రులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. వచ్చిన భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మాలదారులందరికీ రాత్రి భిక్ష పెట్టలేమని అన్నదాన కమిటీ తేల్చేయడంతో వెంటనే స్పందించిన అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు యార్లపాటి శ్రీధర్‌శర్మ 41 రోజుల పాటు మాలదారులకు భిక్షను ఏర్పాటు చేయడంతో ఆయనకు మాలదారులందరూ కలిసి ఘనంగా సన్మానించారు. అలాగే కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన గురుస్వామిగా ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు గోపినాథ్‌నాయుడు, గురుస్వాములుగా గౌండసూరి, బోయ చిరంజీవిని నిర్ణయించారు. అనంతరం వారిని కూడా సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బొమ్మన నాగసుదర్శన్‌రెడ్డి, సభ్యులు చిరంజీవి, మదు పాల్గొన్నారు.

APPSC,TGPSC UPSC CIVIL SERVICES EXAMS SPECIAL

# సామాజిక అవగాహన

**సామాజిక అవగాహన** (Social Awareness)

గ్రీకు తత్వవేత్త ఆరిస్టాటిల్ వివరణ ప్రకారం మానవుడు సంఘజీవి. సమాజం మానవ సంబంధాల పునాదులపై నిర్మితమైంది. సాంఘిక జీవనం అనేది మానవునికి సహజ సిద్ధంగాను, అవసరంకొద్ది ప్రాప్తిం చేది. సకల చరాచర జీవులకంటే మానవ జీవనం ఎంతో వైవిధ్యంతో కూడుకొని ఉంటుంది. మానవ సమాజాల మాదిరిగానే చీమలు, తేనెటీగలు వంటి క్రిమికీటకాలలో, జంతువుల్లో కూడా సమాజాలు ఉన్నప్పటికీ అవి వ్యవస్థీకృతమైనవి కావు. ఒక క్రమ పద్ధతిలో పరిణామం చెందుతున్న మానవ సమాజాలు వ్యక్తికి సంపూర్ణ జీవనాన్ని ప్రసాదిస్తున్నాయి. వ్యక్తి సమాజం వల్ల ప్రభావితమవుతాడు. అంతేకాకుండా సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తాడు.

సమాజం-మానవుడు అనే అంశాలు విడదీయరానివి. మానవ ఆవిర్భావం జరిగి మిలియన్ సంవత్సరాలు అయినప్పటికీ మానవుని సామాజిక జీవనాన్ని క్రమబద్ధంగా అధ్యయనం చేయడమనేది ఆధునిక కాలంలో వెలుగులోకి వచ్చింది.

ఫ్రెంచ్ తత్వశాస్త్ర ఆగస్ట్ కామ్టే 1837లో సమాజ శాస్త్రం అనే పదాన్ని రూపొందించి ఆధునిక సమాజశాస్త్ర ఆద్యుడిగా పేరొందాడు. లాటిన్ భాషలోని సొసైటీస్, గ్రీకు భాషలోని లోగస్ అనే పదాల కలయిక వల్ల సోషియాలజీ (సమాజశాస్త్రం) అనే పదం ఆవిర్భవించింది. ఈ శాస్త్రాన్ని మొదట సోషల్ ఫిజిక్స్ అని పిలిచేవారు. మానవ సామాజిక సంబంధాలను అధ్యయనం చేయడమే సమాజశాస్త్రం యొక్క ప్రధాన లక్ష్యం. సామాజిక అవగాహన అనగా మానవుడు తాను నివసిస్తున్న సమాజం పట్ల, సామాజిక సమస్యల పట్ల శాస్త్రీయ దృక్పథాన్ని, జ్ఞానాన్ని, స్పృహను, చేతనాన్ని కలిగి ఉండటం.

మెకైవర్ అనే సామాజిక శాస్త్రవేత్త వివరణ ప్రకారం సామాజిక సంబంధాల సాలెగూడును సమాజం అంటారు. అనగా సమాజంలోని సభ్యులు ఒకరితో మరొకరు తప్పనిసరిగా సామాజిక సంబంధాలను కలిగి ఉంటేనే దాన్ని సమాజం అంటారు. ఈ సామాజిక సంబంధాలే సామాజిక అవగాహనకు ప్రాతిపదిక. సమాజ శాస్త్రం ఇటీవల కాలంలోనే ఆవిర్భవించినప్పటికీ మానవుని సామాజిక జీవనం గురించి ఎన్నో వందల ఏండ్లకు పూర్వమే అనేకమంది తత్వవేత్తలు అధ్యయనం చేశారు. మానవుని సామాజిక జీవనానికి సంబంధించిన



క్రమబద్ధమైన చర్చలు మొదట గ్రీకు దేశానికి చెందిన తత్వవేత్తల నుంచి మొదలయ్యాయి.

ప్లేటో (క్రీ.పూ. 427-347), ఆరిస్టాటిల్ (క్రీ. పూ. 384-322) వంటి గ్రీకు తత్వవేత్తలు మానవుని సామాజిక జీవనానికి సంబంధించి తార్కిక పద్ధతిలో అనేక సిద్ధాంతాలను రూపొందించే ప్రయత్నం చేశారు.

మన దేశంలో క్రీస్తు పూర్వమే కౌటిల్యుని అర్థశాస్త్రంలో మానవుని జీవనానికి సంబంధించిన అనేక విషయాలను చర్చించారు. మానవుని సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవనాన్ని క్రమబద్ధం చేసే అనేక సూత్రాలు, సిద్ధాంతాలను కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో పేర్కొన్నాడు. పాణిని మరియు పతంజలి వంటి భారతీయ తత్వవేత్తలు వారి రచనల్లో మానవుని సామాజిక జీవనానికి సంబంధించిన అనేక అంశాలను వివరించారు. 16వ శతాబ్దం వరకు మానవ సామాజిక జీవనానికి సంబంధించి వాస్తవికమైన శాస్త్రీయ అధ్యయనాలు జరగలేదనే చెప్పవచ్చు.

16వ శతాబ్దానికి చెందిన మాకియవెల్లి రచించిన The Prince అనే గ్రంథం రాజ్యం, రాజకీయత అనే విషయాలను వాస్తవానికి దగ్గరగా చర్చించింది. ఇదే కాలానికి చెందిన సర్ థామస్ మోర్ అనే మరో తత్వవేత్త రచించిన యుటోపియా అనే గ్రంథం మానవుని దైనందిన సామాజిక సమస్యల గురించి వివరించింది. భారతదేశంలో 1920 నుండి సమాజశాస్త్రం వైజ్ఞానిక విషయంగా అభివృద్ధి చెందుతూ వస్తు న్నది. ఈ అభివృద్ధిలో రాధాకమల్ ముఖర్జీ, జి.ఎస్. ఘూర్యే, డీపీ ముఖర్జీ, ఎంఎన్.శ్రీనివాస్ వంటి సామాజిక శాస్త్రవేత్తల కృషి అనిర్వచనీయం.

అనేక మిలియన్ సంవత్సరాల క్రితం ఆరంభమైన జీవన యాత్రలో మానవుడు అనేక అటుపోట్లను ఎదుర్కొంటూ సంచార జీవనం గడుపుతూవేట, ఆహార సేకరణ, పశుపోషణ, మారక/పోడు వ్యవసాయం చివరకు స్థిర వ్యవసాయానికి చేరుకొని స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకొని సామాజిక జీవనం గడపటం వల్ల సామాజిక సంబంధాలు ప్రారంభమయ్యాయి. ఫలితంగా నూతన మానవ సమాజం అవతరించింది.

సమాజంలో మానవ కార్యకలాపాలు బహుముఖంగా ఉంటాయి. వీటిని అధ్యయనం చేయడానికిగాను ఆవిర్భవించిందే సమాజశాస్త్రం. 19వ శతాబ్దంలో ఆవిర్భవించిన సమాజశాస్త్రం 20వ శతాబ్దంలో వేగంగా అభివృద్ధి చెందింది, ప్రత్యేక బోధనాశాస్త్రంగా, స్థిరపడింది శాఖోపశాఖలుగా విస్తరించింది.

మానవుడు సంఘజీవి. మానవ జననం మొదలు మరణం వరకు వ్యక్తిని తీర్చిదిద్దేది సమాజమే. వ్యక్తి తన లక్ష్యాలను చేరుకోవడానికి సమాజం మీద పూర్తిగా ఆధారపడతాడు. అదే సమయంలో సమాజాభివృద్ధికి, ఔన్నత్యానికి తన వంతు కృషిని అందిస్తాడు. ప్రతి సమాజంలోనూ ఆ సమాజ సభ్యుల మధ్య విభిన్న పరస్పర చర్యలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి. సమాజ సభ్యుల మధ్య పరస్పర సామాజిక సంబంధాలు ఉండడం వల్ల పరస్పరాశ్రయులై ఉండటమే కాకుండా ఒకరికొకరు సహకార భావంతో మెలగుతారు. సమాజంలోని సభ్యులు తాము నివసించే ప్రాంతంలోని ఇతర సభ్యుల పట్ల సంఘటిత లేదా ఐక్య భావాన్ని కలిగి ఉంటారు. ఈ భావం వారిని ఆత్మీయులుగా ఉంచడానికి, ఒకరికొకరు కలిసికట్టుగా జీవించడానికి, మేము అనే భావనను, మనం అనే అనుభూతిని కల్పించడానికి దోహదపడుతుంది. తద్వారా సభ్యుల్లో సంఘీభావం ఏర్పడి సామరస్యంతో జీవించగలుగుతారు.

(మిగతా వచ్చేవారం...)



**Dr. P. Harish,**
Director
Perfect Academy,
Hyderabad.

# ఎకానమి

APPSC, TGPSC గ్రూప్-1, 2 JL, DL

(గత వారం తరువాయి... )

**పారిశ్రామిక క్షేత్రాల ఆధునిక రూపాలు (ఇండస్ట్రియల్ పార్క్స్ కారిడార్స్ జోన్) -**

- ఎన్ఎమ్జడ్- నేషనల్ మానుఫాక్చరింగ్ జోన్
- ఎస్ఇజడ్ - స్పెషల్ ఎకనామిక్ జోన్... మొదలైనవి.

సమీక్ష : పారిశ్రామిక విస్తరణలో పారిశ్రామిక క్షేత్రాలు ప్రముఖ పాత్ర పోషించినప్పటికీ వాటి పురోగతి, ఉత్పత్తి, ఉపాధి లక్ష్యాలను సాధించటంలో కొంత మందకొడిగా ఉంది.

- పారిశ్రామిక క్షేత్రాలు గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాలలో ఎక్కువ విజయాన్ని సాధించాయి. అంటే ప్రాంతీయ అసమానతలను తగ్గించటంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేదని చెప్పవచ్చు.
- ఏది ఏమైనప్పటికి ఆర్థిక వ్యవస్థలో ముఖ్యంగా పారిశ్రామిక రంగ అభివృద్ధిలో పారిశ్రామిక క్షేత్రాలు తమ వంతు పాత్రను ప్రముఖంగా పోషించాయని చెప్పవచ్చు.

**నియమబద్ధమైన మార్కెట్లు :**

- వ్యవసాయ మార్కెట్‌లోని లోపాలను, మోసాలను అరికట్టడానికి 1951లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్కెట్లను నియమబద్ధమైన మార్కెట్లు అంటారు.
- ఈ నియమబద్ధమైన మార్కెట్లను క్రమబద్ధమైన మార్కెట్లు అని, రెగ్యులేటెడ్ మార్కెట్లు అని కూడా అంటారు.
- వీటి నిర్వహణకు ప్రభుత్వం ఒక కమిటీని నియమిస్తుంది. దీనిలో రైతులు, వ్యాపారస్తులు, స్థానిక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.
- ఈ మార్కెట్లో కమిషన్ ఏజెంట్లకు లైసెన్సులు జారీ



చేయడం, వ్యవసాయ వస్తువుల ధరలు ప్రకటించడం, తూనికలు, కొలతలు ప్రామాణీకరించడం, రైతులకు కావలసిన పరపతి, సాంకేతిక సదుపాయాలు కల్పించడం దీని లక్ష్యం.
- ఈ నియమబద్ధమైన మార్కెట్లు 1951లో దేశవ్యాప్తంగా 200 ఉంటే 2015 మార్చి నాటికి దేశవ్యాప్తంగా 6746కి పెరిగి పని చేస్తున్నాయి.
- తెలంగాణలో 260 క్రమబద్ధ మార్కెట్లు పనిచేస్తున్నాయి.

**సూక్ష్మవిత్తం (మైక్రో ఫైనాన్స్) :**

- పేదవారితో బ్యాంకింగ్ అనే నినాదంతో సూక్ష్మవిత్తం ప్రాచుర్యం పొందింది. గ్రామీణ, పట్టణాలలోని పేదలకు స్వయం ఉపాధి లబ్దిదారులకు, చర మూలధన అవసరాలకు ఋణాలు ఇచ్చి వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా చూడటమే కాకుండా పొదుపును ప్రోత్సహించడం సూక్ష్మ విత్తం లక్ష్యం.
- 2016-17లో 1.9 మిలియన్ల స్వయం సహాయక బృందాలకు 38000 కోట్ల విత్త/ఆర్థిక సహాయాన్ని అందించెను.

**లీడ్ బ్యాంక్ పథకం 1969 :**

- 1967లో గాడ్గిల్ కమిటి - ఏరియా అప్రోచ్ పద్ధతిలో లీడ్ బ్యాంకును సూచించెను.
- 1969లో నారిమన్ కమిటి బ్యాంకర్ల సంఘం, ఏరియా అప్రోచ్‌ను సమర్థిస్తూ లీడ్ బ్యాంక్ పథకమును సిఫారసు చేసెను.
- లీడ్ బ్యాంకు పథకాన్ని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా 1969 డిసెంబరులో ప్రవేశపెట్టింది.
- ఈ పథకం బ్యాంకులు, మరియు ఇతర అభివృద్ధి సంస్థల కార్యకలాపాలను వివిధ వేదికల ద్వారా సమన్వయం చేయడం ద్వారా ప్రవాహాన్ని / అభివృద్ధిని సాధించే లక్ష్యంగా పెట్టుకుంది.
- ప్రాధాన్యత రంగాలకు, ఇతర రంగాలకు గ్రామీణ రంగం యొక్క అభివృద్ధిలో బ్యాంకుల పాత్రను ప్రోత్సహించడానికి జిల్లాలో కార్యకలాపాలను సమన్వయం చేయటం కోసం ఒక నిర్దిష్ట బ్యాంకుకు జిల్లా లీడ్ బ్యాంకు బాధ్యతను అప్పగించారు.
- ప్రతీ జిల్లాకు ఒక జాతీయ బ్యాంకును / ప్రవేటు బ్యాంకును లీడ్ బ్యాంకుగా నియమించెను.
- ఇది జిల్లాలోని ఇతర బ్యాంకులను కలుపుకొని / సమన్వయపరుస్తూ జిల్లాలోని వ్యవసాయ పరపతి అవసరాలను తీరుస్తుంది.
- దీని సమయాధికారం 5 సం.లు ఉంటుంది. అయితే ఇటీవల దీని వ్యవధిని 3 సం.లకు తగ్గించారు.
- ఇది దేశ వ్యాప్తంగా 380 జిల్లాలలో ప్రారంభమై 580 జిల్లాలకు విస్తరించింది.
- ప్రస్తుతం (2015-16) తెలంగాణలో ఈ బ్యాంకుల సంఖ్య 4682. వీటిలో ఎక్కువగా హైదరా బాద్‌లో (1102) ఉండగా తక్కువగా ఆదిలాబాద్‌లో (239) ఉన్నాయి.



ఎం.అన్నారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ
హనుమకొండ



# ఇండియన్ పాలిటి ప్రాథమిక విధులు

## ప్రాథమిక విధులు
(Fundamental Duties)

- "విధి" అనగా ఒక వ్యక్తి ఇతరులకోసం నిర్వర్తించవలసిన పని లేదా బాధ్యత అని అర్థం.
- సామాజిక జీవనంలో వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, నమ్మకం, గౌరవం అనేవి ఉదాత్తమైన మానవీయ పరిపక్వతా లక్షణాలుగా పేర్కొంటారు. సమాజం ద్వారానే వ్యక్తి అన్ని లక్షణాలను, స్వభావాలను అలవర్చుకుంటాడు. అలాగే, అనేక ప్రయోజనాలు పొందుతాడు.
- పౌరుల హక్కులు మరియు కర్తవ్యాలు పరస్పర సంబంధితాలు, విడదీయరానివి అయినప్పటికీ, అసలు రాజ్యాంగంలో ప్రాథమిక కర్తవ్యాలు (విధులు) లేకుండా కేవలం ప్రాథమిక హక్కులనే పొందు పరిచారు. అంటే, రాజ్యాంగ రూపశిల్పులు పౌరుల కర్తవ్యాలను రాజ్యాంగంలో చేర్చడం అవసరం అని భావించలేదు. అయితే, వారు రాష్ట్ర కర్తవ్యాలను రాజ్య విధాన ఆదేశక సూత్రాల (Directive Principles of State Policy) రూపంలో చేర్చారు. తరువాత 1976లో పౌరుల ప్రాథమిక కర్తవ్యాలు రాజ్యాంగంలో చేరాయి. 2002లో మరొక ప్రాథమిక కర్తవ్యాన్ని కూడా జోడించారు.
- భారత రాజ్యాంగంలోని ప్రాథమిక కర్తవ్యాలు మాజీ సోవియట్ యూనియన్ (USSR) రాజ్యాంగం నుండి ప్రేరణ పొందాయి. గమనించదగ్గ విషయమేమిటంటే, USA, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి ముఖ్య ప్రజాస్వామ్య దేశాల రాజ్యాంగాల్లో పౌరుల కర్తవ్యాల జాబితా ప్రత్యేకంగా లేదు. ప్రపంచంలో జపాన్ రాజ్యాంగమే పౌరుల కర్తవ్యాలజాబితా కలిగిన ఏకైక ప్రజాస్వామ్య రాజ్యాంగం. మరోవైపు, సామ్యవాద దేశాలు హక్కులు మరియు కర్తవ్యాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చాయి. అందుకే మాజీ USSR రాజ్యాంగం పౌరుల హక్కులు, స్వేచ్ఛలు, వారి కర్తవ్యాలు, బాధ్యతలతో విడదీయరానివని ప్రకటించింది.

**స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసులు**

- 1976లో, అంతర్గత అత్యవసర పరిస్థితి (1975-77) సమయంలో పౌరుల కర్తవ్యాల అవసరం ఎక్కువగా అనిపించడం వలన, కాంగ్రెస్ పార్టీ సర్దార్ స్వరణ్ సింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. పౌరులు హక్కులను అనుభవించడంతో పాటు కర్తవ్యాలను కూడా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని ఈ కమిటీ ప్రాముఖ్యంగా పేర్కొంది.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సిఫారసులను ఆమోదించి 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976 ద్వారా కొత్త భాగాన్ని Part IVA రాజ్యాంగంలో చేర్చింది. ఈ భాగంలో అర్టికల్ 51A కింద మొదటిసారిగా పది ప్రాథమిక విధులు ప్రవేశపెట్టబడ్డాయి. అయితే కమిటీ సూచించిన కొన్ని అంశాలను ప్రభుత్వం అంగీకరించలేదు. అవి:


1. ఏ కర్తవ్యాన్ని పాటించకపోతే శిక్షలు లేదా జరిమానాలు విధించడానికి పార్లమెంట్‌కు అధికారం ఇవ్వాలి.
2. అలాంటి శిక్షలను ప్రశ్నిస్తూ ఏ పౌరుడూ న్యాయస్థానాన్ని ఆశ్రయించకూడదు.
3. పన్నులు చెల్లించడం కూడా ఒక ప్రాథమిక కర్తవ్యంగా ఉండాలని సూచించింది.

**విధుల ప్రాముఖ్యత**

- విధులు సమాజ వికాసం, దేశాభివృద్ధికి, సామాజిక స్పృహ కల్పించడానికి దోహదం చేస్తాయి. దేశ ఐక్యతను, సమగ్రతను పెంపొందిస్తాయి. ప్రాథమిక హక్కులనే కాయలు విధులుగా పరిపక్వం చెందినప్పుడే సమాజ జీవనం ఫలప్రదం అవుతుంది.

**విధులు - రకాలు**

- సాధారణంగా విధులను రెండు రకాలుగా వర్గీకరిస్తారు. అవి.
  1. నైతిక విధులు




  2. చట్టబద్ధమైన విధులు

- నైతిక విధులు అనగా ప్రజల యొక్క నైతిక విలువలపై, సామాజిక స్పృహపై ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకు, పెద్దలను మరియు ఉపాధ్యాయులను గౌరవించడం, అభాగ్యులను, విధివంచితులను ఆదుకోవడం, మొదలగునవి.
- చట్టబద్ధమైన విధులు అనగా సమాజంచేత ఆమోదించబడి, ప్రభుత్వంచేత గుర్తించబడిన బాధ్యతలు. వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హులు అవుతారు. ఉదాహరణకు,ట్రాఫిక్ నియమాలను పాటించడం, పన్నులను సక్రమంగా చెల్లించడం,మొదలగునవి.

**ప్రాథమిక విధులు**

- ప్రతి పౌరుడు దేశంపట్ల, తన తోటి పౌరుల పట్ల కొన్ని కనీస బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రతిపత్తి కల్పించడం చేత వీటిని ప్రాథమిక విధులు అంటారు.
- వీటిని రష్యా రాజ్యాంగం నుండి గ్రహించారు. మౌలిక రాజ్యాంగంలో ప్రాథమిక విధుల ప్రస్తావన లేదు. ఐతే 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్దార్ స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలోని 4-4 భాగం, నిబంధన 51-Aలో పొందుపరిచారు. ప్రారంభంలో పది ప్రాథమిక విధులు ఉండేవి. విశ్వ మానవ హక్కుల ప్రకటన 1948లోని అధికరణ 29(1). అలాగే అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం ప్రవేశికలో కూడా ప్రాథమిక విధుల ప్రస్తావన ఉంది.
- 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక విధిని రాజ్యాంగంలో చేర్చడం ద్వారా వీటి సంఖ్య పదకొండుకు పెరిగింది. ఈ సవరణ 12 డిసెంబర్ 2002 నుంచి అమల్లోకి వచ్చింది.

గమనిక : జనవరి 3, 1977 నుంచి 10 ప్రాథమిక విధులు అమలులోకి వచ్చాయి. ఈ రోజును ప్రాథమిక విధుల దినోత్సవంగా పరిగణిస్తారు.

**ప్రాథమిక విధులు** (Article 51A)

ప్రతి భారత పౌరుడి ముఖ్య ప్రాథమిక విధులు

(1)రాజ్యాంగాన్ని ఆచరించడం మరియు దాని ఆదర్శాలు, రాజ్యాంగ సంస్థలు, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని గౌరవించడం.

(2)స్వాతంత్ర్య సంగ్రామాన్ని ప్రేరేపించిన ఉన్నత ఆదర్శాలను ఆదరించడం మరియు అనుసరించడం.

(3)భారతదేశ సార్వభౌమత్వం, ఏకత్వం, సమగ్రతను కాపాడడం.

(4)అవసరమైతే దేశ రక్షణ చేయడం మరియు జాతీయ సేవ చేయడం.

(5)మత, భాష, ప్రాంతీయ వైవిధ్యాలను అధిగమించి ప్రజలందరిలో సౌభావ్యత,సోదరభావం పెంపొందించడం, మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఆచారాలను విడనాడడం.

(6)దేశపు సమ్మిళిత సంస్కృతిక వారసత్వాన్ని విలువ చేయడం, సంరక్షించడం.

(7) అరణ్యాలు, సరస్సులు, నదులు, వన్యప్రాణులు వంటి ప్రకృతిని రక్షించడం,మెరుగుపరచడం మరియు జీవరాశుల పట్ల కరుణ చూపడం.

(8)శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, ప్రశ్నించే ధోరణి, సంస్కరణ భావాన్ని అభివృద్ధి చేయడం.

(9)ప్రజా ఆస్తిని రక్షించడం మరియు హింసను త్యజించడం.

(10)వ్యక్తిగతంగా, సమూహపరంగా ప్రతి రంగంలో ఉత్తమత సాధించడానికి కృషి చేయడం, తద్వారా దేశ ప్రగతిని పెంపొందించడం.

(11) 6 నుండి 14 ఏళ్ల వయస్సు గల తన సంతానం లేదా సంరక్షణలో ఉన్న పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించడం. (2002 లో 86వ సవరణతో చేర్చారు )

**ప్రాథమిక విధుల లక్షణాలు**

1. వీటిలో కొన్ని నైతిక విధులు , కొన్ని పౌర విధులు . ఉదాహరణకు
   - స్వాతంత్ర్య సంగ్రామ ఆదర్శాలను ఆదరించడం - నైతిక కర్తవ్యం
   - జాతీయ జెండా, జాతీయ గీతాన్ని గౌరవించడం - పౌర కర్తవ్యం
2. ఇవి భారతీయ సంప్రదాయం, పురాణాలు, మతాలు, ఆచారాలలో భాగమైన విలువలను ప్రతిబింబిస్తాయి.
3. పౌరుల హక్కులు విదేశీయులకు కూడా వర్తించగలిగే కొన్ని ఉన్నప్పటికీ, ప్రాథమిక కర్తవ్యాలు కేవలం భారత పౌరులకు మాత్రమే వర్తిస్తాయి.
4. రాజ్యాంగం వీటిని న్యాయపరంగా అమలు చేయదగినవిగా చేయలేదు (non-justiciable). వీటి అమలుకు ప్రత్యక్ష న్యాయపరమైన శిక్షలు లేదా చర్యలు రాజ్యాంగంలో లేవు. అయితే, పార్లమెంట్ చట్టం ద్వారా వాటికి అమలు చేయగలదు.

**ప్రాథమిక విధులు - సుప్రీంకోర్టు తీర్పులు**

**శ్యాం నారాయణ్ చాక్సీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2003)**

- జాతీయ పతాకాన్ని ప్రైవేట్ వ్యక్తులు ప్రచారం కోసం వినియోగించరాదని ఈ కేసులో సుప్రీం కోర్టు పేర్కొంట్ అలాగే చలనచిత్రం వంటి ప్రసార మాధ్యమాల్లో సన్నివేశ సమయాలలో జాతీయ గీతాన్ని ఉపయోగించరాదని తీర చెప్పింది. అయితే 2016లో సినిమా హాళ్ళలో సినిమా ప్రారంభం ముందు జాతీయ గీతాన్ని వినిపించాలని పేర్కొంది

**బిజోయ్ మాన్యూవల్ Vs కేరళ (1986)**

- జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించవలసిన అవసరం లేదని ఈ కేసులో సుప్రీం కోర్టు పేర్కొంది. జాతీయ ఆలాపన అనేది వారి మత విశ్వాసాలకు విరుద్ధం అయితే దానికి మినహాయింపు ఉంటుంది. అయితే జాతీయ గీతాని ఆలపించినప్పుడు అందరూ గౌరవ సూచికంగా నిలబడాలని పేర్కొంది.

**అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ Vs స్టూడెంట్ యూనియన్ (2002)**

- ప్రాథమిక విధులు విస్మరించరాదని. అది దేశ సమగ్రతకు, సామాజిక జీవనానికి ఆదర్శంగా ఉంటాయని పేర్కొంది.

**డా. దాశరథి Vs ఆంధ్రప్రదేశ్**

- ఆస్థాన కవుల హెదా చెల్లదని ఈ కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

**గ్రామీణ వ్యాజ్యాలు హక్కుల కేంద్రం Vs ఉత్తరప్రదేశ్ (1986)**

- పర్యావరణ పరిరక్షణలో ప్రాథమిక విధులను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

**నవీన్ జిందాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా** (2004)

- జాతీయ జెండాను ఎగరవేయడం భావ వ్యక్తీకరణ క్రిందికి వస్తుందని, పౌరులు స్వేచ్ఛగా జెండా ఎగురవేసే హక్కు ఉంటుందని పేర్కొంది.



సత్య ఇర్గదిండ్ల
SATYA SIR APP
9177323403

## రచనలకు ఆహ్వానం

**పోటీ పరీక్షలకు అత్యుత్తమ మెటీరియల్, గైడెన్స్ అందిస్తూ 'ప్రజ్ఞ' విద్యార్థుల మన్ననలందుకుంది. 'ప్రజ్ఞ'ను మరింత ఉపయోగకరంగా తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు, ఔత్సాహికుల నుంచి రచనలను (మెటీరియల్) ఆహ్వానిస్తున్నాం. ఏపీపీఎస్సీ , టీజీపీఎస్సీ, ఆర్ఆర్బీ, ఎస్ఎస్సి, బ్యాంక్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్‌ను సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రాయగల అధ్యాపకులు మెటీరియల్‌ను 'ప్రజ్ఞ' ఇమెయిల్ (suryaapragna71@gmail.com)కు లేదా 7288890072 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. రచనతో పాటు ఫోటో, ఫోన్ నెంబర్, అడ్రస్ తదితర వివరాలను జత చేయాలి.**

## ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల శివారులోని ఆయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్‌విఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి, డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఇంజనీర్ కిషోర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కల్పించారు కాలుష్యాన్ని తగ్గించడం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, భవిష్యత్ తరాల కోసం పర్యావరణ రక్షణను ప్రధానంగా ఆకర్షిస్తుంది. అనంతరం కాలుష్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

**ఆదోని రూరల్, మేజర్‌న్యూస్:** భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఏఓ లావణ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దహరివాణం లోని జిల్లా పరిషత్ పాఠశాల నందు నేల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, నేల ఆరోగ్యంగా ఉండాలంటే రసాయనిక పురుగు మందుల వాడకాలను తగ్గించి, భూసార పరీక్షల ద్వారా భూమిలోని లోపాలను తెలుసుకొని తద్వారా భూమికి అవసరమైన పోషకాలను అందించి మంది దిగుబడులను సాధించవచ్చని తెలియజేశారు. మట్టి పరీక్షల కొరకు మట్టిని ఏవిధంగా సేకరించాలని, ఏలా ల్యాబ్‌కు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటిఎం రామాంజిని, కెవి కె సిబ్బంది, తేజ కుమార్, పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, టీచర్లు చిరంజీవి, రవీంద్ర, వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చాగలమర్రిలో వాహనాలు తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ సురేష్

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** చాగలమర్రి మండల పరిధిలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలి వద్ద మంగళవారం ఎస్సై సురేష్ వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు నడుపుతున్న వాహనదారులకు దాదాపు 38వేల 560 రూపాయలు జరిమానా విధించడం జరిగింది. మొత్తం 43 ఈ చలానాలు విధించడం జరిగింది చలానా ఎక్కడైనా ఆన్లైన్లో వాహనదారులు చెల్లించవచ్చున్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు నియమావులు పాటించి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు హెల్మెట్ ధరించడం వల్ల సురక్షిత ప్రయాణం జరుగుతుందన్నారు. రెండోసారి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపిడిఒగా చంద్రమౌళి


బాధ్యతలు చేపట్టిన ఎల్.టి చంద్రమౌళి

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** మండల కేంద్రమైన దొర్నిపాడులోని మండల పరిషత్ కార్యాలయం నందు డిప్యూటీ ఎంపిడిఒగా ఎల్.టి చంద్రమౌళి బాధ్యతలు మంగళవారం స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సీనియర్ అసిస్టెంట్‌లుగా ఉన్న వారికి ప్రదోన్నతలు కల్పించడంలో భాగంగా దొర్నిపాడు మండలానికి జిల్లా ఉన్నతాధికారులు డిప్యూటీ ఎంపిడిఒగా చంద్రమౌళిని నియమించారు. గతంలో చంద్రమౌళి ఆళ్లగడ్డ పంచాయితీరాజ్ కార్యాలయం నుండి పదోన్నతిపై మండల పరిషత్ కార్యాలయానికి డిప్యూటీ ఎంపిటిడిఒగా రావడం జరిగింది. సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నెం. పద్మ పదోన్నతిలో భాగంగా అన్నమయ్య జిల్లాలోని నందలూరు మండలానికి బదిలీ కావడం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన ఎల్.టి చంద్రమౌళికి ఎంపిడిఒ సావిత్రి, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సావిత్రి, జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, కంప్యూటర్ ఆపరేటర్ కిశోర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దాడి కేసులో ముద్దాయిలకు జైలు శిక్ష


పిడతల వెంకట స్వామి(ఫైల్ ఫోటో)

**కర్నూలుక్రైం, మేజర్‌న్యూస్ :** దాడి కేసులో ముద్దాయిలు పిడతల వెంకటస్వామి, పిడతల లక్ష్మీదేవిలపై నేరం రుజువు కావడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు జడ్జి అనిల్ కుమార్ ఒక ఏడాది జైలు శిక్షను విధిస్తూ తీర్పు నిచ్చారు. కోర్టులో విచారణలో ఉన్న కేసులు త్వరితగతిన విచారణ పూర్తి చేసి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్న కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్ ఆద్వర్యంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉప్పరి లక్ష్మిదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటస్వామి, లక్ష్మీదేవిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసులో శిక్ష పడటానికి ఏపిపి గోపాలకృష్ణ సమర్థవంతంగా వాదనలు వినిపించి సాక్ష్యాలను నిరూపించడంలో కీలకపాత్ర పోషించారు. అలాగే సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టిన కానిస్టేబుల్స్ తిక్కస్వామి, జాన్సన్‌లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రతి రైతు పంటలకు భీమా చేయించుకోవాలి


**– వ్యవసాయాధికారి హేమలత**


వరిపంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి హేమలత

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** రైతులు పంటలు సాగుచేసే రైతులు వారి పంటలకే భీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని కురుకుంద గ్రామంలో పంటకోత ప్రయోగంపై, పంట మార్పిడి, పంటలభీమాపై వ్యవసాయాధికారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ 10వ పంటల భీమా వారోత్సవాలు డిసెంబర్ 1 నుంచి 7వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజనపై రైతులకు వివరించామన్నారు. తాము సాగు చేసే పంటలకు రైతులు తప్పనిసరిగా భీమా చేయించుకోవాలని , వరి, జొన్న, మినుము పంటలక దిగుబడిని బట్టి భీమా వర్తిస్తుందన్నారు. జొన్న పంటలకు ఎకరాకు రూ . 60 ప్రీమియం చెల్లిస్తే రూ.18,800 భీమా, మినుపంటకు ఎకరానికి రూ. 48 చెల్లిస్తే భీమా మొత్తం రూ. 19000,వరి పంటకు ఎకరానికి రూ. 126 చెల్లిసేత 42000, శనగ పంటక ఎకరానికి 84 చెల్లిస్తే రూ. 28000 పొందవచ్చన్నారు. అలాగే రైతులు ఒకే పంటను కాకుండా పంటల సాగులో పంటమార్పిడి వ్యవసాయం చేస్తే అధికదిగుబడులు పొందవచ్చన్నారు. మినుము విబిఎన్ 8,9,10 రకాల మినికిట్స్‌ను రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఇఓ రాజశేఖర్, సాజిద్‌బాష, విఏఏ ముర్తుజావలి, ఎంపిఇఓలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

**-పెసలదిన్నె కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ**



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** రైతు సంక్షేమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పనిచేస్తున్నారని, రైతు ఆనందంతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వర రెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ పథకంపై ఎమ్మిగనూరు మండలం పెసలదిన్నె గ్రామంలో ఆయన పర్యటించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ రైతులకు ఆదుకునేందుకు అన్నదాత సుఖీభవ పథకం ఎంతో ఉపయోగపడిందన్నారు. వర్ష ప్రభుత్వం నిరంతరం రైతుల సంక్షేమం కోసమే ఆలోచిస్తుందన్నారు. మరిన్ని రైతు సంక్షేమ పథకాలు అమలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన వితంతు నూతన పెన్షన్లను ఎమ్మెల్యే చేతుల మీదకు పంపిణీ చేశారు. అలాగే నూతన సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ, మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి పూజ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కేటి వెంకటేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మండలస్థాయిలో ముగిసిన ఉపాధ్యాయ క్రీడలు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** కొలిమిగుండ్ల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులకు క్రీడలు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండల విద్యాధికారి అబ్దుల్ కలాం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారము సమగ్ర శిక్ష మరియు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులకు క్రీడల పోటీలను నవంబరు 29 నుంచి ప్రారంభించడం జరిగింది. కొలిమిగుండ్ల మండలంలో డిసెంబరు 2న నిర్వహించడం జరిగింది. ఈ క్రీడల్లో పాల్గొన్న వారిని మండల విద్యాధికారి అభినందిస్తూ ఇక్కడ గెలుపొందిన ఉపాధ్యాయిని ఉపా ధ్యాయులకు నియోజకవర్గస్థాయిలో ఈనెల 13న నిర్వహించడం జరుగుతుందని అలాగే నియోజకవర్గం గెలుపొందిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు 14వ తేదీన జిల్లాస్థాయిలో నిర్వహించడం జరుగుతుందని అక్కడ గెలుపొందిన వారికి రాష్ట్ర కమిటీ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నవి కాబట్టి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మండలస్థాయిలో నిర్వహించడం జరిగిందని మండలస్థాయిలో త్రోబాల్‌లో ఉపాధ్యాయునీలను సెలెక్ట్ చేయడం జరిగిందని క్రికెట్‌లో మూడు టీంలు పాల్గొనడం జరిగిందని ఈ మూడు టీంలలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులలో 11మందిని సెలెక్ట్ చేసుకొని వారిని నియోజకవర్గస్థాయికి పంపించడం జరుగుతుందని మండల విద్యాధికారి అబ్దుల్ కలాం తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చల్లా కొండప్ప, ముఖ్య అతిథిగా మండల రెవెన్యూ అధికారి శ్రీనివాసులు మరియు మండల పరిషత్ ఉపాధికారి చంద్రశేఖర్ గౌడ్ అలాగే ఎస్.ఐ , సబ్ ఇన్స్పెక్టర్, పోలీసులు గోపాల్ మరియు రాంకో సిమెంట్ శోభన్ బాబు చంద్రమోహన్ మరియు క్రీడా ఉపాధ్యాయ బృందం నాగరాణి, దివాకర్ వారి మిత్ర బృందం మండల విద్యాశాఖ నుండి ఆర్‌పిలు రాజేష్, మద్దిలేటి, అకౌంటెంట్ కాంతారావు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో మహిళలు అరెస్టు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :**


దొంగతనం చేసిన మహిళ యాస్మిన్

దొంగతనం కేసులో యాస్మిన్ అనే మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు త్రీ టౌన్ సిఐ శేషయ్య మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సోమవారం ధనలక్ష్మి నగర్‌కు చెందిన దేవమ్మ అనే మహిళ రేషన్ షాప్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా యాస్మిన్ బుర్కా వేసుకుని వెనుకవైపు నుండి దేవమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసును లాగి ఆమెను కిందపడేసి ఆమె గొంతుపై కాలు పెట్టి గొలుసును లాక్కెళ్లిపోయిందన్నారు. ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న త్రీ టౌన్ సిఐ శేషయ్య ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పీ బాబు ప్రసాద్ ఆద్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి మంగళవారం యాస్మిన్ బంగారు గొలుసును నందికోట్కూరులో అమ్మేందుకు వెళ్లేందుకు సిద్దంగా ఉండగా జొహరాపురం రోడ్డులో ఆమెను పోలీసులు పట్టుకుని ఆమె వద్దనున్న ఒక తులం బంగారు గొలుసు, ఒక కత్తి, కత్తెర, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పెట్టగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జడ్జి ఆమెకు 14రోజుల రిమాండ్‌కు విధించినట్లు తెలిపారు. దొంగతనం కేసును 24గంటల్లో చేధించినందుకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ త్రీటౌన్ సిఐ శేషయ్య, కానిస్టేబుల్ పరమేష్, రాముడు, సుచిత్రలను అభినందించారు.

**అభివృద్ధి పథంలో భాగంగా**

## రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజన

**అవుకుమేజర్,న్యూస్ః** రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి ఒక్కొక్క జోనుకు ఒక్కొక్క సీనియర్ ఐ.ఎ.ఎస్ అధికారిని సి.ఈ.ఒగా నియమించడం జరిగింది. ఇందులో భాగంగా రాయలసీమ జిల్లాలు చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, అన్నమయ్య, కడప జిల్లాలను కలిపి ఒక జోన్‌గా ఏర్పాటు చేసి దీని పర్యవేక్షణకు రాష్ట్రంలో ప్రస్తుత రోడ్లు భవనాలు ముఖ్య కార్యదర్శి ఎం.పి క్రిష్ణబాబును సి.ఈ.ఒగా నియమించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నారు.

# సచివాలయాల్లో వేధిస్తున్న ఉద్యోగుల కొరత

**– సిబ్బంది లేక ఇబ్బందుల్లో ప్రజలు**
**– పట్టించుకోని ఉన్నతాధికారులు**

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉన్న సచివాలయాల్లో ఉద్యోగుల కొరత వేధిస్తుందని, సచివాలయాల్లో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని 19 సచివాలయాలు పత్తికొండ కేంద్రంలో ఆరు సచివాలయాలు ఉన్నాయి. పత్తికొండ, చిన్నహుల్తి, దేవనబండ గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్స్ ఉద్యోగులు లేక పోవడంతో ప్రజలకు సేవలు అందక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కుల ధృవ పత్రాలు, ఆడంగల్, పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు, వివిధ రకాల సేవలన్ని సచివాలయాల ద్వారానే నిర్వహిస్తున్నారు. సచివాలయంలో ప్రధానంగా డిజిటల్ అసిస్టెంట్స్ ఉద్యోగులకొరతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే సర్వేలు, అభివృద్ధి పనులను పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ 9, మహిళా పోలీసులు 3 వెల్ఫేర్ అసిస్టెంట్స్ –2, పంచాయతీ సెక్రటరీ –2, ఉద్యోగులు సచివాలయాల్లో ఖాళీగా ఉన్నాయి. పనుల నిమిత్తం వెళ్లిన ప్రజలు ఉద్యోగుల కొరత ఉండడంతో పనులు జరగక ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుచున్నారు. ఈ విషయమై ఎంపిడిఓ కవితారెడ్డిని అడుగగా సచివాలయంలో ఉద్యోగుల కొరత ఉన్న మాట వాస్తవమేనని ఉన్నతాధికారులకు లెటర్ పెట్టామని తెలిపారు. సచివాలయంలో ఉద్యోగులకొరత తీరుతుందని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎంపిడిఓ తెలిపారు.


సచివాలయం

**ఉద్యోగుల కొరత ఉన్న సచివాలయాల్లో వెంటనే నియమించాలి :** ఉద్యోగులకొరత ఉన్న సచివాలయాల్లో ఉద్యోగులను వెంటనే నియమించాలని సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి డిమాండ్ చేశారు. మండలం లోని గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేక పోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు దరఖాస్తులు, విద్యార్థులకు క్యాస్ట్ సర్టిఫికేట్ జారీ చేయడం గృహ నిర్మాణాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సిబ్బంది సేవలు అవస రమన్నారు. సచివాలయాల్లో సిబ్బంది లేని చోట ప్రజలుచాలా అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధి కారులు తక్షణమే సిబ్బందిని నియమించాలన్నారు.



సీపీఐ మండల కార్యదర్శి

# కలెక్టర్ గమనిస్తున్నారు..!

**:– ఫిర్యాదుల స్పెషల్ కంట్రోల్ రూమ్‌పై ప్రశంశల వెల్లువ**


కలెక్టర్ డా.ఏ సిరి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం అందించే లక్ష్యంతో ప్రారంభించిన స్పెషల్ కంట్రోల్ రూమ్ విజయవంతంగా కొనసాగుతూ, జిల్లా పరిపాలనలో కొత్త ఒరవడిని సృష్టిస్తోంది. ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన మొదటి నెలలోనే ప్రజల నుండి దాదాపు 80ఫిర్యాదులు రావడం, వాటికి వేగవంతమైన పరిష్కారం లభించడంపై జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత వేగవంతమైన చర్యలు జరుగుతాయని ప్రజలు సైతం ఊహించలేదని తెలుస్తోంది.

**కార్యకలాపాల సమన్వయం :** ప్రజలు తమ సమస్యలను నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4299 ద్వారా స్పెషల్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేస్తున్నారు. ఈ కంట్రోల్ రూమ్ నిర్వహణ నిజంగా మెచ్చుకోదగినదిగా పేరు తెచ్చుకుంది. పౌరుల నుండి అందిన ఫిర్యాదులు ఏ శాఖకు సంబంధించినవైతే, ఆ శాఖ జిల్లా అధికారికి వెంటనే సమాచారం తెలియజేయడం, దానిని అప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం ప్రధానంగా జరుగుతోంది. ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మహిళా శిశు సంక్షేమ శాఖ, పురపాలక సంఘాలు(మున్సిపాలిటీస్), పంచాయతీరాజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ వంటి కీలక విభాగాలకు సంబంధించిన సమస్యలు కంట్రోల్ రూమ్ దృష్టికి వస్తున్నాయి. అలాగే పత్రికలలోని వ్యతిరేక కథనాలపై కూడా ప్రత్యేక దృష్టితో ఫిర్యాదుల పరిష్కారంతో పాటు, కంట్రోల్ రూం ప్రత్యేకంగా ప్రతికలలో వచ్చే వ్యతిరేక వార్తలను(నెగటివ్ కథనాలను) కూడా పర్యవేక్షిస్తోంది. ఆయా కథనాలకు సంబంధించి వెంటనే వివరణ ఇవ్వాలని, సమస్యను పరిష్కరించాలని సంబంధిత శాఖలను ప్రత్యేక బృందం అప్రమత్తం చేస్తోంది. ఈ పర్యవేక్షణ ద్వారా ప్రభుత్వ పనితీరుపై పారదర్శకత పెరుగుతోంది. దీనికి సంబంధించి సూపరింటెండెంట్, డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్ మాట్లాడుతూ స్పెషల్ కంట్రోల్ రూం చేస్తున్న మెరుగైన పర్యవేక్షణ విధానం ప్రజల నుండి విశేష ఆదరణ పొందుతోందని సమస్య పరిష్కారం అయిన తర్వాత మళ్లీ రెండు, మూడు రోజులకు సమస్య తీరిందా లేదా అని తెలుసుకోవడం ద్వారా ఫిర్యాదుదారులు సంతృప్తి చెందుతున్నారు. ఈ పద్దతి ద్వారా పరిష్కారాలు తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా ఉండేలా చూస్తున్నామని, కొన్ని శాఖలకు వీడియో కాల్స్ కూడా చేస్తూ సమయపాలన మరియు విధుల్లో ఉన్నారా..లేరా..అని కూడా పర్యవేక్షిస్తున్నాం అని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ తీసుకున్న ఈ వినూత్న చర్య ఇలాగే కొనసాగితే ప్రజలకు తమ సమస్యలకు సత్వర పరిష్కారాలు లభిస్తాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# నంద్యాలలో ఇద్దరు దారుణ హత్య

**–కుటుంబ కలహాలతో ఘటన – హరిజన వాడలో ఉద్రిక్తత**

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా కేంద్రంలో ఇద్దరు దారుణహత్యకు గురయ్యారు. ఒక కుటుంబంలో తలెత్తిన కలహాలను అడ్డుకోబోయిన ఇద్దరిని ఒక మహిళ కుటుంబ సభ్యులు కత్తులతో విచక్షణా రహితంగా హత్య చేశారు. ఇద్దరు హత్యకు గురి కావడంతో హరిజన వాడలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ముందు జాగ్రత్తగా భారీ బదోబస్తు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నంద్యాల పట్టణంలోని హరిజన వాడలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత మహాలక్ష్మి, ఆమె భర్త మధు ఘర్షణ పడ్డారు. పక్కనే ఉన్న మహాలక్ష్మి మరిది పెద్దన్న ఘర్షణను అడ్డుకోబోయారు. పెద్దన్నతో పాటు ఉప్పరిపేటకు చెందిన సురేష్ సహాయంగా వెళ్లారు. మహాలక్ష్మితో పాటు ఆమె కుటుంబ సభ్యులు కలిసి పెద్దన్నను కత్తులతో తీవ్రంగా గాయపరిచారు. పక్కనే ఉన్న సురేష్‌ను కత్తులతో దాడి చేశారు. స్థానికులు పెద్దన్నను, సురేష్‌ను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే పెద్దన్న మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన సురేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మధు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన వారు స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు తెలుస్తోంది. హరిజనపేటలో ఇద్దరు దారుణ హత్యకు గురి కావడంతో జీర్ణించుకోలేని రక్త సంబంధీకులు అక్కడ ఉన్న వాహనాలకు నిప్పుపెట్టి ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ అస్రార్‌బాష కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


దారుణ హత్యకు గురైన పెద్దన్న, హత్యకు గురైన సురేష్

# 2.5 కేజిల కణతిని తొలగించిన డాక్టర్ బ్రహ్మారెడ్డి


ఆపరేషన్ ద్వారా కణతిని తొలగిస్తున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని స్థానిక ప్రజావైద్యశాలలో కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ కడుపులో ఉన్నటువంటి 2.5కేజిల కణతిని మంగళవారం ఆపరేషన్ ద్వారా తొలగించినట్లు డాక్టర్ బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. చికిత్స అనంతరం మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన పేర్కొన్నారు.

# పశ్చిమ ప్రాంతం అభివృద్ధికై "ఆదోని" జిల్లా చెయ్యాలి

★వలసల ప్రాంతం, వెనుబాటుపై పాలకులు గుర్తించాలి
★కూటమికి చేతకాక పోతే జగనన్న పాలనలో ఆదోని జిల్లా చేస్తాం
★ విద్యా , ఉపాధి రంగాల్లో పెద్దపీట వెయ్యాలి
★ వైద్య కళాశాలను పిపిపిలోకి తీసుకెళ్లి .. పేదలకు వైద్య విద్యను దూరం చెయ్యకండి
★ఎమ్మిగనూరు నుండి బారీ ఎత్తున వైకాపా శ్రేణులతో ఆదోనికి రాక
★ ఆదోని జిల్లా సాదన జేఏసి నాయకులకు సంఘీభావం
★కర్నూలు వైకాపా సమన్వయకర్త బుట్టా, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయన్న

**ఆదోని, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో వెనుకబడిన ప్రాంతం అయిన పశ్చిమ ప్రాంతం అభివృద్దిని ఆకాంక్షించి ఇక్కడున్న వెనుకబాటు తనాన్ని, వలసలను గుర్తించి వాటి నివారణ చర్యలు పాలక ప్రభుత్వాలు తీసుకోవాలంటూ ఇందులో బాగంగా కూటమి ప్రభుత్వం ఆదోని జిల్లాగా ప్రకటించాలని కర్నూలు పార్లమెంట్ వైకాపా సమన్వయకర్త, మాజీ ఎంపి బుట్టారేణుక , ఆదోని మాజీ ఎమ్మెల్యే వై. సాయి ప్రసాద్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మిగనూరు వైకాపా పార్లమెంటరీ పార్టీ కార్యాలయం నుండి పెద్ద ఎత్తున వైకాపా శ్రేణులతో తరలి వచ్చి బుట్టారేణుక ఆదోని పట్టణంలో కోట్ల విజయబాస్కరరెడ్డి కూడలి నందు ఆదోని జిల్లాగా ప్రకటించాలని చేపట్టిన నిరవదిక దీక్షకు మద్దతుగా వారు సంఘీబావం తెలిపేందుకు బయలుదేరి వచ్చారు. దాదాపు 100 వాహనాల్లో 1000 మంది దాక వైకాపాశ్రేణులు, యువకులు, రైతులు ఆదోని జిల్లా చెయ్యాలనే డిమాండ్‌తో గళం వినిపించారు. అనంతరం ఆదోని నిరసన శిభిరంలో ఉన్న వారికి సంఘీభావం ప్రకటించిన బుట్టా, సాయన్నలు మాట్లాడుతూ రాష్టంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేసిన ఘనత జగనన్నది అన్నారు. కూటమి పాలనలో మరో ఆరు జిల్లాలను పెంచుతామని మంత్రివర్గ కమిటీలు వేసి కేవలం మూడు జిలాల్లను పెంచి చేతులు దులుపుకోవాలని చూడటంలో రాయలసీమపై చంద్రబాబుకు కపట ప్రేమ ఉందని నిరూపించుకున్నారని దుయ్యబట్టారు. జగనన్న 2029లో మరో మారు ముఖ్యమంత్రిని చేసుకుంటే ఆదోని జిల్లాను సాదించి తీసుకొస్తాం అన్నారు. కూటమి పాలకులు ఆదోని జిల్లాను ప్రకటించి పశ్చిమ ప్రాంతంలో ఎమ్మిగనూరు , మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ప్రాంతాల అభివృద్ధిని పరచడమేకాక విద్య , ఉపాధి, పారిశ్రామిక, సాగునీటి వనురలను సాదించి పెట్టాలని డిమాండ్ చేశారు. ఆదోని ప్రాంతంలో జగనన్న నిర్మాణం చేపట్టిన వైద్య కళాశాలను పిపిపి పరం చెయ్యకుండా పేదలకు వైద్యవిద్యను ప్రభుత్వం అందించే చర్యలు తీసుకోవాలని లేక పోతే జగనన్న వచ్చాక పిపిపి కాంట్రాక్టులను రద్దుపరిచి ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్వహన బాద్యతలు చేపట్టి పేదలకు వైద్య విద్యను ఉచితం చేస్తుందన్నారు. మాజీ ఎంపి బుట్టా రేణుక ఎమ్మిగనూరు నుండి పెద్ద ఎత్తున వాహనాలతో రావడం, జేఏసి నాయకులకు సంఘీభావం తెలుపడంతో జిల్లా పశ్చిమ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చానీయంశంగా మారింది. ఇటీవలనే ఎమ్మిగనూరు సమన్వయకర్త పదవి నుండి జగనన్న తప్పించినా అక్కడ ఎర్రకోట కుటుంబంపై తన బల నిరూపణ చేసుకుని బుట్టా కుటుంబాన్ని చేనేతపురి ఆహ్వానిస్తుంది అని నీరుపించుకున్నారని రాజకీయ విశ్లేషకులు భావించేలా చేశారు. ఆదోని జిల్లా కావాలని డిమాండ్‌కు ఇంత పెద్దెత్తున మద్దతును కూడగట్టారని కర్నూలు పార్లమెంటులో ఓ ఘట్టంతో సహసోపేతంగా నిర్వహించారని 7 నియోజకవర్గ నాయకులు, జనాలు అనుకునే విదంగా ముందుకు పొయ్యారనే చెప్పవచ్చు.. వైకాపా రాష్ట్ర యువజన విభాగం ఉపాద్యక్షులు బుట్టా ప్రతుల్, సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠప్ప, ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహ్మద్, నాగేష్ నాయుడు, పార్టీ జిల్లా ఉపాద్యక్షు లు కెఆర్ మురారిరెడ్డి, కెఆర్ రాంకోటిరెడ్డి, శివారెడ్డిగౌడు, నాగేశప్ప, శివకుమార్ , విరుపాక్షిరెడ్డి, యువజన నాయకులు బసిరెడ్డి, బోయరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆదోని జిల్లా సాదన కమిటి శిభిరంలో మాట్లాడుతున్న బుట్టా


సమావేశంలో మాట్లాడుతున్న వై. సాయిప్రసాద్‌రెడ్డి



జాదోని జిల్లాకై పెద్దెత్తున తరలివచ్చిన జనం